

5న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు రాక?

విజయనగరం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు అక్టోబరు 5న జిల్లాకు వస్తున్నట్టు సమాచారం. ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పైడిమాంబ సిరిమానోత్సవం ఈ నెల 6, 7 తేదీల్లో జరగనుంది. ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు పైడిమాంబకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందుకోసం అశోక్‌గజపతిరాజు 5న జిల్లాకు చేరుకుని, 6న తొలేళ్ల రోజున కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేయనున్నారు. సిరిమానోత్సం అనంతరం తిరిగి గోవా వెళ్లనున్నట్టు తెలిసింది.



పూజారి పర్యవేక్షణలో రూపుదిద్దుకుంటున్న సిరిమాను

పండుగ ఏర్పాట్లు షురూ..

- సిద్ధమవుతున్న సిరిమాను
- పూజారి వెంకటరావు పర్యవేక్షణలో చురుగ్గా పనులు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ పండుగ ఏర్పాట్లు షురూ అవుతున్నాయి. సిరిమాను సిద్ధమవుతోంది. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు నివాస ప్రాంతమైన హుకుంపేటలో ఆయన పర్యవేక్షణలో పనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు సిరిమానును దర్శించి పసుపు, కుంకుమలు సమర్పిస్తూ భక్తులు హుకుంపేటలో మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఈ ఏడాది కూడా 50 అడుగుల పొడవున సిరిమానును తయారు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన మానును చెక్కే నిపుణులతో సిరిమాను రూపుదిద్దుకుంటోంది. ఆ ప్రాంతంలోకి వాహనాలు వెళ్లకుండా టూటౌన్ పోలీసులు బందోబస్తు చూస్తున్నారు.

భక్తుల బారులు

పైడిమాంబ ఆలయానికి భక్తులు క్యూ కడుతున్నారు. మరో వారం రోజుల్లో అమ్మవారి ఉత్సవం జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తున్నారు. ఎప్పటిలాగే ఆలయం ఎదురుగా ప్రముఖులు, వీఐపీల కోసం ప్రత్యేక గేటును ఏర్పాటు చేసి అక్కడ ఆలయ సిబ్బందిని నియమించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా చదురుగుడి, వనంగుడిలో పైడిమాంబను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

భద్రత పటిష్టం



- ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ తొలేళ్ల, సిరిమానోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శనివారం బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణం సమీపంలో తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో డ్రోన్స్‌తో నిఘా పెట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి పోలీసు కంట్రోల్ రూంలోని టీవీలకు అనుసంధానం చేయాలన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతంలోని ప్రైజర్ పాయింట్స్ వద్ద మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ పండుగ చాటింపు

వచ్చే నెల 6, 7 తేదీల్లో జరగనున్న పైడిమాంబ సిరిమానోత్సవానికి సంబంధించి చాటింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నారు. చదురుగుడి, కోట వద్ద చాటింపు జరుగుతుంది. తలయారీ రామవరపు చినపైడిరాజు మిగతా డప్పు కళాకారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

- గ్రోత్‌సెంటర్‌పై జిల్లాలో చర్చ
- దశాబ్దాలుగా కొనసాగుతున్న లోపాలు
- ఎందుకీ నిర్లక్ష్యమంటున్న బొబ్బిలి ప్రజలు
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బేబీనాయన



ఇకనైనా గ్రోత్ ఉంటుందా?


గ్రోత్ సెంటర్ వస్తే తమ జీవితాల్లోనూ 'గ్రోత్' ఉంటుందని రైతులు ఆశించారు. పిల్లలకు ఉపాధి దొరుకుతుందని సంబరపడ్డారు. ఏపీఐఐసీ అడిగిందే తడవుగా భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. ఇతర వర్గాలు కూడా తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించారు. వారి అంచనాలకు తగ్గట్టుగానే ప్రారంభంలో గ్రోత్ సెంటర్‌లో 203 పరిశ్రమలు వచ్చాయి. ఇదే దారిలో మరిన్ని వస్తాయనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా ఉన్నవి మూసేశారు. కొత్త పరిశ్రమల రాక కలగా మిగిలింది. దశాబ్దాలుగా పాలకులు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. తాజాగా గ్రోత్‌సెంటర్ దుస్థితిపై అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబీనాయన సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. దీనిపై స్పీకర్, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ పరిణామాలను గమనిస్తున్న జిల్లా ప్రజలు ఇప్పుడైనా గ్రోత్ సెంటర్ దశ మారుతుందేమోనని ఆశ పడుతున్నారు.

బొబ్బిలి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెబుతూ ప్రభుత్వం బొబ్బిలి పట్టణ సమీపంలో మెట్టవలస, నారాయణప్పవలస గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూములు సేకరించి 1995లో గ్రోత్ సెంటర్ ఏర్పాటు చేసింది. భూములిచ్చిన రైతులు తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఎంతగానో ఆశించారు. కానీ అలా జరగలేదు సరికదా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని భూములు తీసుకున్న వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు కూడా ముఖం చాటేశారు. నేడు గ్రోత్ సెంటర్‌లో అభివృద్ధి పూర్తిగా పడకేసింది. గత ఏడాది ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో గ్రోత్ సెంటర్ గురించి లేవనెత్తినప్పటికీ ఎటువంటి ప్రగతి కనిపించ లేదు. తాజాగా రెండోసారి సమస్యలను ఏకరువు పెట్టారు. సమస్యల విషయానికొస్తే గ్రోత్‌సెంటర్‌లో రోడ్లన్నీ సర్వనాశనం అయ్యాయి. చీకటిపడితే లోపలికి అడుగుపెట్టడానికి బెంబేలెత్తుతున్నారు. వీధిదీపాలు లేక పాముల సంచారం పెరిగింది. విద్యుత్ టారిఫ్ ఎక్కువగా ఉండడంతో కొత్తవారు ఆసక్తి చూపడం లేదు. పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలాలు తీసుకున్న వారు వృథాగా వదిలేయడంతో వాటిల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి భయపడేలా చేస్తున్నాయి.

ఐలా కార్యకలాపాలేవీ?

పారిశ్రామిక భవన యజమానుల నుంచి వసూలు చేసిన ఆస్తిపన్ను రుసుం ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) అకౌంట్‌కు జమ కావాల్సి ఉంది. అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించిన తరువాత గ్రోత్‌సెంటరులోని స్థలాలు పరిశ్రమలు (మిగతా 10వ పేజీలో..)



నిరుపయోగంగా పరిశ్రమ భవనాలు

1న జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

- పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

దత్తిరాజేరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల 1న జిల్లాకు రానున్నారు. దత్తిరాజేరు మండలంలోని దత్తి గ్రామంలో పర్యటించనున్నారు. ఈ సమాచారం అందడంతో సీఎం పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి జేసీ సేతుమాధవన్ శనివారం పరిశీలించారు. దత్తి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణాన్ని హెలిపాడ్, బహిరంగ సభకు ప్రతిపాదించారు. జేసీ వెంట బొబ్బిలి ఆర్డీవో రామ్మోహన్, చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, తహసీల్దార్ పి.విజయభాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



అధికారులతో చర్చిస్తున్న జేసీ సేతుమాధవన్

అమృత్‌భారత్ రైలుకు బొబ్బిలిలో ఘన స్వాగతం

- స్టేషన్‌లో జెండా ఊపిన మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు, రైల్వే అధికారులు



బొబ్బిలిలో రైలుకు జెండా ఊపుతున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన బ్రహ్మపూర్-ఉద్నా (గుజరాత్) ఎక్స్‌ప్రెస్(అమృత్‌భారత్ రైలు) శనివారం సాయంత్రం బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. వాల్తేరు రైల్వే సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, నార్త్ సీనియర్ డివిజనల్ ఇంజనీరు ఎంపీ రమణ, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తదితరులు కొత్తరైలుకు ఘనస్వాగతం పలికారు. అదే రైలులో విజయనగరం నుంచి వస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచందర్‌ను (మిగతా 10వ పేజీలో..)

'అమృత్‌భారత్'కు విజయనగరంలోనూ స్వాగతం 9

పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా పద్మనాభరాజు



డెంకాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చింతలవలస 5వ బెటాలియన్ (ఏపీఎస్పీ) కమాండెంట్‌గా సీహెచ్‌వీఎస్.పద్మనాభరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమావేశమై వృత్తి నైపుణ్యం, శిక్షణ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రకృతి విపత్తులు, సేవలు, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో బెటాలియన్ సిబ్బంది ఎల్లప్పుడూ అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. పద్మనాభరాజు ప్రస్తుతం శ్రీకాకుళంలోని మొదటి బెటాలియన్ కమాండెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంతకుముందు ఆయన ఎలైట్ ఫోర్స్ గ్రేహౌండ్స్‌లో 25 సంవత్సరాలకుపైగా సేవలందించారు. రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతులమీదుగా పోలీస్ మెడల్ ఫర్ గాలంట్రీ పొందారు.

అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు

విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసత్యప్రచారాలు చేస్తూ మహిళలను అగౌరవపరుస్తూ పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ అధికారులను ఆదేశించారు. శనివారం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి పోస్టును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ఇందుకోసం ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించి అతని పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అసభ్యకర పోస్టులు పెట్టే వ్యక్తిని గుర్తించాలన్నారు. తరచుగా అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారి వివరాలను సేకరించాలని, వారికి సహకరిస్తున్న వ్యక్తులను వ్యవస్థీకృత నేరం చేసినట్టుగా పరిగణించి ఆ నేరానికి సంబంధించిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 134 కేసులు నమోదుచేసి 106 మందిని అరెస్టు చేసి 57 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేశామన్నారు.

రోడ్డు తారుమారు



గిరిజనుల రాకపోకల కోసం నిర్మిస్తున్న రోడ్డు ఇది. ప్రతి మలుపు వద్ద కుంగిపోయింది. అడుగడుగునా బీటలు వారింది. ఏమాత్రం వర్షం పడినా తారు కొట్టుకుపోతోంది. ఎక్కడికక్కడ గుంతలకు కొదవలేదు. వేపాడ మండలం మారిక గిరిజన గ్రామం రోడ్డు దుస్థితిది.

- ఎక్కడికక్కడ కొట్టుకుపోతున్న తారు
- ప్రతి మలుపు వద్ద కుంగుతున్న వైనం
- అడుగడుగునా బీటలు
- వేపాడ మండలం మారిక రోడ్డు దుస్థితిదీ

శృంగవరపుకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండలం కరకవలస పంచాయతీ శివారు మారిక గిరిజన గ్రామం కొండ శిఖరాన ఉంది. రహదారి సదుపాయం లేక బాహ్యప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ అక్కడకెళ్లి పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కరువయ్యారు. అత్యవసర వైద్యానికి 10.60 కిలోమీటర్ల దూరంలో వున్న మైదాన ప్రాంతానికి కాలినడకన కొండ దిగాల్సిందే. తమకు రహదారి సదుపాయం కావాలని గిరిజనులు కొన్నేళ్లగా అడుగుతుండడంతో 2012-2013 ఆర్థిక సంవత్సరంలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం నుంచి రూ.3.53 కోట్లు విడుదల చేసింది. 3.63 కిలోమీటర్ల దూరం (మిగతా 10వ పేజీలో..)

8లో

ఆడపిల్లలమని దిగులు పడకుండా..

- వివిధ రంగాల్లో రాణిస్తున్న బిడ్డలు
- నేడు కుమార్తెల దినోత్సవం

కల నెరవేరిన వేళ

- నూతన ఉపాధ్యాయుల్లో పట్టలేని ఆనందం

రేబీస్.. యమ డేంజర్

- కుక్క కాటుతో ముప్పు
- జిల్లాలో పెరుగుతున్న మరణాలు
- వ్యాక్సిన్‌తో ప్రయోజనం
- నేడు ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం

జిల్లాకు పండుగ కళ

- కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

అక్రమాలు వెలుగుచూసేనా..?

- గత ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి
- వీవోఏలే కీలకం
- సహకారం అందించిన మండల స్థాయి అధికారులు
- రికవరీ అంతంతమాత్రమే
- స్త్రీనిధి రుణాల వ్యవహారంపై దృష్టిసారించని కూటమి ప్రభుత్వం

గజపతినగరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):

- రామన్నపేట గ్రామానికి చెందిన వీవోఏ స్త్రీనిధి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో వెలుగు అధికారులు ఆమెను విధుల నుంచి తొలగించారు. రూ.4లక్షల50 వేల రికవరీకి ఆదేశించగా ఇంకా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంది.
- పాత శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన వీవోఏపై అవినీతి ఆరోపణలు రావడంపై డ్వాక్రా గ్రూపుసంఘ సభ్యులే స్వయంగా తీర్మానం చేసి ఆమెను తొలగించి వేరొకరికి బాధ్యతలు అప్పగించాలని అధికారులను కోరారు.
- పురిటిపెంట గ్రామానికి చెందిన వీవోఏ ఇటీవల విధులు నిర్వహించలేనంటూ స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈమెపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. స్త్రీనిధి రుణాల రికవరీలో సంఘ సభ్యుల నుంచి నగదు వసూలు చేసినట్లు అధికారుల దృష్టికి రావడంతో ఆమెపై విచారణ జరుగుతోంది.

గజపతినగరంలోని వెలుగు విభాగంలో జరుగుతున్న అక్రమాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. స్థానిక వెలుగు కార్యాలయం కూడా (మిగతా 10వ పేజీలో..)



ఆడపిల్లలమని దిగులు పడకుండా..

- వివిధ రంగాల్లో రాణిస్తున్న బిడ్డలు
- నేడు కుమార్తెల దినోత్సవం

ఒకప్పుడు ఆడపిల్ల పుడితే ఇబ్బందిగా భావించేవారు. కుమార్తెను గుండెల మీద కుంపటి అనుకునేవారు. కూతుళ్లను చదివించడం వ్యర్థమని... విద్య కోసం వెచ్చించే మొత్తాన్ని పెళ్లికి కేటాయిస్తే సరిపోతుందనే భావనతో ఉండేవారు. రాను రానూ జనంలో ఆ అభిప్రాయం మారుతూ వస్తోంది. ఆడపిల్లలను తల్లిదండ్రులు సాకే విధానంలోనూ మార్పు వచ్చింది. కుమార్తెలూ అంతే...తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి.. తాము అనుకున్న లక్ష్యాలను సాధించడంలో ముందుంటున్నారు. ఆటలు.. పాటలు.. చదువులు.. సేవలు.. ఇలా అన్ని రంగాల్లో తమదైన ముద్ర చూపిస్తున్నారు. దీనికి అదనంగా జీవిత చరమాంకంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకుంటున్న వారిలో కుమార్తెలే అధికంగా ఉంటున్నారు.

అమ్మ జ్ఞాపకార్థం..

సాలూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) పాచిపెంట మండలంలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న తోరిక లక్ష్మమ్మ స్వగ్రామం పణుకువలస. తల్లిదండ్రులు సీతమ్మ, సన్యాసి కూలి పని చేసి ఆమెను చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని ఆమె మరిచిపోలేదు. ఉద్యోగం వచ్చిన తరువాత అత్తమామలకు, తల్లిదండ్రులకు బాసటగా నిలిచారు. తల్లి మరణానంతరం జ్ఞాపకాలను పదిలం


పణుకువలసలో తల్లి జ్ఞాపకార్థం నిర్మించిన గుండం వద్ద లక్ష్మమ్మ

చేసుకున్నారు. తల్లి సీతమ్మకు గుండం (చిహ్నం) నిర్మించారు. తల్లి గుండానికి (చిహ్నానికి) రోజూ పూజ చేస్తారు. తన తల్లిదండ్రులకు నిరంతరం రుణపడి ఉంటానని... ఎవరైనా తల్లిదండ్రులను, అత్తమామలను గౌరవించాలని ఆమె అభిప్రాయపడ్డారు.

డాక్టర్‌గా సేవలు.. నాయకత్వ లక్షణాలు

బొబ్బిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని రెడ్డి అప్పలనాయుడు-అనిత దంపతులకు చైతన్య అనే కుమార్తె ఉంది. ఆమె తండ్రి మాజీ సైనికుడు. చిన్ననాటి నుంచి చదువులో ఎంతగానో రాణిస్తోంది. దంత వైద్యురాలిగా రాణిస్తోంది డాక్టర్ చైతన్య. ఆమె రచనావ్యాసంగంలో కూడా ప్రతిభను చూపుతున్నారు. ఆలిండియా డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ సీఎంఆర్ రైల్వే హాస్పిటల్‌లో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచి కృషి, పట్టుదలతో తన ప్రతిభను చాటుకుంటూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. విధి నిర్వహణలో ఆమె రెండు నేషనల్ అవార్డులు సాధించింది. యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లను పొందిన ఆమె అనిడ్స్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. దంత చికిత్స సర్జన్ హోదాలో ఎన్నో అవగాహనా కార్యక్ర మాలు నిర్వహించారు. దంతవైద్యానికి సంబంధించిన అనేక పుస్తకాలను రచించారు. 'నాన్న నా వెనకాలే ఉన్నా రన్న ధీమా, ధైర్యం, పట్టుదల వంటివి నన్ను ముందుకు నడిపిస్తున్నాయి. ఒకే ఒక్క కూతురినన్న


తల్లిదండ్రులతో డాక్టర్ చైతన్య

అల్లారుముద్దుకు కొదువలేదు. అదే సమయంలో జీవిత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ముందడుగు వేసేందుకు పుష్కలమైన మనోధైర్యం రంగరించి ఇచ్చారు మా తల్లిదండ్రులు' అంటున్నారు డాక్టర్ చైతన్య.

రేబీస్.. యమ డేంజర్



- కుక్క కాటుతో ముప్పు
- జిల్లాలో పెరుగుతున్న మరణాలు
- వ్యాక్సిన్‌తో ప్రయోజనం
- నేడు ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి)

● విజయనగరం జిల్లా కేంద్రంలో 12 ఏళ్ల బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ వీధి కుక్క కాటుకు గురయ్యాడు. పెద్దగా గాయం కానందున కుటుంబ సభ్యులు పట్టించు కోలేదు. కొద్ది రోజుల తరువాత బాలుడు నీళ్ల తాగలేక పోవడం... భయాందో ళనలకు గురవడం... జ్వరం రావడం మొదలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు వైద్యుల వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించగా, అది రేబీస్ చివరి దశ అని తేలింది. సమాయానికి టీకా వేసి ఉంటే... కాపాడవచ్చు నని వైద్యులు చెప్పారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో ఆ బాలుడు మరణించాడు.

● నగరానికి చెందిన ఓ యువకుడు తన పెంపుడు కుక్కకు టీకా వేయకపోవడంతో అది రేబిస్ వ్యాధి బారిన పడింది. యాజమానికి విషయం తెలియక ఆ కుక్కతో ఆడుకునే వారు. కొద్ది రోజుల్లో కుక్క చనిపోవడంతో నిజం బయటపడింది. వెంటనే ఆ యువకుడికి రేబిస్ టీకా వేశారు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఆయన కూడా రేబిస్‌కు గురై... ప్రాణాలు కోల్పోయాడు.

...ఇలా చాలా మంది వ్యక్తులు కుక్క లేదా ఇతర జంతువులు కరిచినా... తక్షణమే వైద్యుడ్ని సంప్రదించి యాంటీ రేబిస్ టీకా వేసుకోకుండా అశ్రద్ధ చేస్తున్నారు. దీంతో రేబిస్ సోకి మరణిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగానే జిల్లాలో రేబిస్ వల్ల మరణాలు పెరుగుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ కొంతమంది అవగాహనలేక వ్యాక్సిన్ తీసుకోకపోవడంతో రేబిస్ బారిన పడుతున్నారు.

రేబీస్‌కు దూరంగా ఉండాలంటే...

● పెంపుడు కుక్కలకు, పిల్లులకు తప్పనిసరిగా రేబీస్ టీకా వేయించాలి.

● కుక్క లేదా ఇతర జంతువులు కాటు వేసినట్టయితే గాయాలను వెంటనే సబ్బు నీటితో 15 నిమిషాల పాటు కడగాలి. ఇది వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి మొదటి అతి ముఖ్యమైన చికిత్స.

● గాయాలు శుభ్రం చేసిన వెంటనే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి పోస్ట్-ఎక్స్‌పో జర్ ప్రొఫైలా క్సిస్ పీఈపీ చికిత్స, యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను తీసుకోవాలి.

● సరైన సమయానికి చికిత్స తీసుకోవడం ద్వారా రేబీస్ ప్రాణాంతకం కాకుండా నిరోధించవచ్చును.

జిల్లాలో పరిస్థితి ఇలా..

సంవత్సరం	కేసులు	మరణాలు
2022	9,321	1
2023	10,662	1
2024	12,767	4
2025 (ఆగస్టు వరకూ)	7,545	6

రేబీస్ నివారణే లక్ష్యంగా..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఏఓ), జంతు ఆరోగ్య సంస్థ (డబ్ల్యూఓఏ హెచ్) వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 0/30 అనే వ్యూ హంతో పని చేస్తున్నాయి. 2030 నాటికి రేబీస్ మరణాలను పూర్తిగా నిర్మూలించాలన్నదే దీని ఉద్దేశం.

టీకా వేసుకోవాల్సిందే..



జంతువులు కరిచినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రేబీస్ టీకా వేసుకోవాలి, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ రేబీస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా కుక్క కరిచిన 1, 3, 7, 14, 28 రోజుల్లో మొత్తంగా ఐదు మోతాదులుగా వైద్యుల పర్యవేక్షణలో యాంటీ రేబీస్ టీకా వేసుకోవాలి. ముందస్తుగా పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేయాలి. రేబీస్‌కు చికిత్స లేదు. కానీ యాంటీ రేబీస్ టీకా సరైన సమయానికి వేయించుకుంటే వంద శాతం రక్షణ లభిస్తుంది. అందుకే జంతువులు కరిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. రేబీస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం అవసరం.

-డాక్టర్ ఎస్.జీవనరాణి,
డీఎంహెచ్‌ఓ, విజయనగరం

కల నెరవేరిన వేళ..

- నూతన ఉపాధ్యాయుల్లో పట్టలేని ఆనందం

భోగాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్ల నుంచో ఎదురు చూసిన క్షణాలు రానేవచ్చాయి. తమ కలల సాకారానికి తోడ్పాటు అందించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు నియామక పత్రాలను చేతికి అందించినపుడు వారి సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ఇదీ నూతన ఉపాధ్యాయుల ఆనందం. ఈనెల 25న రాజధాని అమరావతిలో నిర్వహించిన సభలో డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. దీంతో పలువురు అభ్యర్థులు తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆనంద భాష్పాలు వచ్చాయి...


నారాయణ స్వాతి, భోగాపురం

ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించడానికి నిరంతరం శ్రమించాను. 2018 డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం దక్కకుండా పోయింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహిస్తుందని ఎదురుచూసినా... నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించడంతో ఊపిరి వచ్చినట్లయింది. ఏడేళ్ల కృషితో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాను. నియామక పత్రం అందుకున్న సమయంలో ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి.

ఈ ఉద్యోగం మరో జన్మలాంటిది


పిడుగు భారతి, ముంజేరు

నాకు ఈ ఉద్యోగం లభించడం మరో జన్మ పొందినట్లు ఉంది. ఇటీవల నా భర్త అనారోగ్యం... ఇద్దరు పిల్లలను చదివించుకోవడం భారంగా మారింది. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించకపోవడంతో ఇక జీవితాంతం కష్టాలు తప్పవనుకొంటూ కుటుంబ భారం మోస్తూ వస్తున్నాను. ఎట్టకేలకు ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించడంతో నడిసంద్రంలో ఉన్నవాడికి ఆధారం దొరికినట్లయింది. దీంతో మరలా శక్తిని కూడగట్టుకొని లక్ష్య సాధనకు కృషి చేసి...విజయం సాధించాను. ఉద్యోగ నియామక పత్రం అందుకున్న సమయంలో కొండత బలం వచ్చినట్లయింది.

ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను


పిడుగు సరిత, ముంజేరు

అమరావతిలో ఉపాధ్యాయురాలిగా నియామక పత్రం అందుకొన్న ఘడియల్లో పొందిన ఆనందాన్ని మాటలతో చెప్పలేను. కొంత మందినైనా ప్రయోజకులుగా చేయాలంటే ఉపాధ్యాయుల వల్లనే సాధ్యమవుతుంది. అందుకే ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. 2018లో ఉద్యోగం పొందలేకపోయాను. దీంతో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాను. డీఎస్సీ ప్రకటించడంతో మరలా నా లక్ష్యం కంటి ముందుకు వచ్చింది. నా తల్లిదండ్రులు లక్ష్మీ, కొండల రావు, భర్త సూర్య ప్రోత్సాహంతో కష్టపడి.. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాను. నియామక పత్రం అందుకున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తలచుకొంటూ ఉద్వేగానికి గురయ్యాను.

కొఠియా గ్రూప్ గ్రామాల నుంచి తొలిసారిగా..

సాలూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూప్ గ్రామాలు... ఈ పేరు చెబితే ఉమ్మడి విజయనగరంలో ఏపీ ఒడిశాల మధ్య వివాదాస్పద గ్రామాలని ఏ ఒక్కరిని అడిగినా చెబుతారు. ఈ గ్రామాలకు చెందిన వ్యక్తికి టీచర్ పోస్ట్ అవకాశాన్ని మెగా డీఎస్సీలో కూటమి ప్రభుత్వం అందించింది. పగులుచెన్నారుకు చెందిన వెలగాడ అనిల్ టీచర్ పోస్టును సాధించారు. జోన్ 4లో కడప జిల్లా పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయుడు (టీజీటీ) గా కొలువు సాధించాడు. కొఠియా గ్రూప్ గ్రామాల నుంచి ఏపీ ఉపాధ్యాయ కొలువు సాధించిన తొలి వ్యక్తి ఆయన కావడం గమనార్హం.

గాజులు అమ్ముతూ జీవనం..


ఉద్యోగం సాధించినందుకు కొడుకును అభినందిస్తున్న తండ్రి

అనిల్ తల్లిదండ్రులు అనంత్, ఆనందిని తోణం, నంద, నేరేళ్లవలస సంతల్లో గాజులు, ఇతర ఫ్యాన్సీ వస్తువులు అమ్ముతుంటారు. వారికి ముగ్గురు కుమర్తెలు, ఇద్దరు కుమారులు. రోడ్లు లేని సమయంలో కాలి నడకన కొండలు ఎక్కుతూ గ్రామాలకు, సంతలకు వెళ్లి గాజులు, ఇతర వస్తువులు అమ్మి పిల్లలను పెంచారు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేశారు. అనిల్‌ను సాలూరు ఆర్సీఎం బోర్డింగ్ స్కూల్‌లో హైస్కూలు చదువు పూర్తి చేయించారు. ఇంటర్మీడియట్ పి.కోనవలస గిరిజన గురుకుల కళాశాలలో చదివారు. పణుకువలసలో ఉపాధ్యాయ విద్య పూర్తి చేశారు. పార్వతీపురంలో 2021లో హిందీ పండిట్ శిక్షణ పూర్తి చేశారు. అప్పటి నుంచి డీఎస్సీ కోసం ఎదురు చూశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించి 150 రోజుల్లో ఫలితాలిచ్చింది. ఈ డీఎస్సీలో జోన్ 4లో హిందీ టీజీటీకి పరీక్ష రాసి ఉపాధ్యాయ కొలువు సాధించాడు.

కూటమి ప్రభుత్వం వల్లనే సాధ్యమైంది..

2021లో హిందీ పండిట్ శిక్షణ పొంది డీఎస్సీ కోసం ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించి చెప్పినట్టే తక్కువ వ్యవధిలో పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారు. నేను కడప జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టీజీటీ హిందీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. దీంతో నా కల సాకారమైంది. నా తల్లిదండ్రుల ఆశలు ఫలించాయి. ఇందుకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్‌లకు రుణపడి ఉంటాను.

-వెలగాడ అనిల్, పగులుచెన్నారు

జిల్లాకు పండుగ కళ

- కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు
- స్వగ్రామాలకు శ్రమజీవులు
- అదేబాటలో విద్యార్థులు, ఉద్యోగులు


ఇళ్లకు పయనమవుతున్న విద్యార్థులు

విజయనగరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు దసరా సందడి వచ్చేసింది. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ఇచ్చేశారు. శనివారం నుంచి కాలేజీలకు సైతం సెలవులు ప్రకటించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు స్వస్థలాలకు చేరుకుంటున్నారు. విద్యారులు, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులతో బస్టాండ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది.

● **మహిళలతో కిటకిట..**

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళా ప్రయాణికులు ఎక్కువగా కనిపించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండడంతో ఎక్కువ మంది బస్సుల కోసం వేచి ఉంటున్నారు. గతంలో మహిళలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. రైలు మార్గంలో వెళ్లేవారు. కానీ ఇప్పుడు పేద, మధ్యతరగతి మహిళలు ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన శ్రమ జీవులు సైతం సొంత ప్రాంతాలకు వస్తున్నారు. దీంతో అంతటా సందడి వాతావరణం కనిపిస్తోంది.

● **పెరిగిన విక్రయాలు..**

దసరా పండుగ ఒక వైపు.. పైడితల్లి అమ్మవారి పండుగ మరోవైపు. ఇలా వరుస పండుగల నేపథ్యంలో విజయనగరం మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. ఇటీవల జీఎస్టీ తగ్గింపులతో గృహోపకరణాల ధరలు తగ్గాయి. ఆ ప్రభావం మార్కెట్‌లో కనిపిస్తోంది. కొత్త వాహనాలు, ఎలక్ట్రికల్ పరికరాల విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి. దీంతో విజయనగరంలోని ప్రధాన మార్కెట్లు కిటకిటలాడుతూ కనిపించాయి. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉన్న వారపు సంతల్లో కూడా క్రయవిక్రయాలు పెరిగాయి. దసరా అంటేనే మాంసప్రియులకు పండుగ కావడంతో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. దీంతో వారపు సంతల్లో వాటి విక్రయాలు గణనీయంగా జరుగుతున్నాయి.

నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోండి

- ఎస్పీ దామోదర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేష న్లలో పనిచేస్తున్న పోలీసు అధికారులు స్థానికంగా నమోదైన కేసుల్లో నిందితులకు న్యాయస్థానాల్లో త్వరితగతిన శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. శనివారం పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, మానిటరింగ్ అధికారులు, హెచ్‌సీలతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల విచారణ సమయంలో నిందితులపై నేరారోపణలు రుజువు చేసేందుకు, సాక్షులు సకాలంలో హాజరయ్యేందుకు.. సమన్లను సకాలంలో అమలు చేయాలని స్పష్టం చేశారు. కోర్టులు జారీ చేసిన నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేసి నిందితులు కోర్టు వాయిదాలకు తరచూ హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కేసుల విచారణ మరింత వేగవంతంగా జరిపేలా చూడాలని ఆదేశించారు. పోక్సో, గంజాయి కేసులు, మహిళలపై జరిగే దాడుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గత మూడు నెలల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా సమర్థంగా పనిచేసిన కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బందిని అభినందించారు. ఈ జూమ్ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

- 244 స్టాల్స్‌లో ప్రముఖ ఉత్పత్తుల ప్రదర్శన
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ స్వయం సహాయక సంఘాలు తాము రూపొందించే పేరెన్నికగన్న ఉత్పత్తుల ప్రదర్శనకు అఖిల భారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన (సరస్ ఎగ్జిబిషన్) గొప్ప వేదిగా నిలవనుందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం నుంచి జిల్లా కేంద్రంలో ఇది అందుబాటులో ఉంటుందన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక లోయర్ ట్యాంకుబండ్ రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్‌లో ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకూ అఖిల భారత డ్వాక్రా బజార్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, దుస్తులు, కలంకారీ వస్తువులు, ఆయుర్వేద ఉత్పత్తులు తదితరాలు విక్రయానికి ఉంచుతున్నట్లు చెప్పారు. దీని కోసం సుమారు 244 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మన రాష్ట్రం నుంచి 26 జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని చెప్పారు. గత ఏడాదిలాగే ఇక్కడ కూడా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బంది పడకుండా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకోండి

- అమ్మవారి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి
- ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలి
- ఆర్‌డీవో కీర్తి


మాట్లాడుతున్న ఆర్‌డీవో కీర్తి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఉత్సవాల పనులకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్‌డీవో దాట్ల కీర్తి తెలిపారు. శనివారం సాయంత్రం తన చాంబర్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి అమ్మవారి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. గుడి లోపల దేవస్థానం సిబ్బంది ఎక్కువ మంది ఉండటంతో భక్తుల మధ్య తోపులాట జరుగుతోందన్నారు. వీఐపీల పూజలను ఒక్క నిమషంలో పూర్తి చేయాలని తెలిపారు. ఉత్సవాలకు డొనేషన్లు ఇచ్చిన వారికి ఎల్‌ఈడీ స్క్రీన్లపై ఉచితంగా ప్రచారం చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని... పారిశుధ్యం కోసం షిఫ్టులలో సిబ్బందిని నియమించాలని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని తెలిపారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పాత భవనాల యాజమానులకు నోటిసులు జారీ చేసి... వాటిపై మనుషులు లేకుండా చూడాలని ఆర్డీవో సూచించారు. బారికేడ్లు పటిష్ఠంగా ఉండాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. అత్యవసర వైద్య వాహనాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. డీజే సౌండ్స్ లేకుండా... ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ గోవిందరావు, తహశీల్దార్ కూర్మనాథ్, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శనివారం ఆమె అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి, వినతిపత్రం అందించారు. నిధులు అందించేందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజాం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలగా వీధిలోని విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రోటరీ క్లబ్ రాజాం శాఖ ఆధ్వర్యంలో వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి రొటేరియన్ డా.వై.కళ్యాణ్ చక్రవర్తి, వైద్య బృందం సారథ్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆప్తాలమిక్ అధికారి డా.సప్పటి వసంతరావు శనివారం తెలిపారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి

రేగిడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోకి వచ్చిన అపరిచిత వ్యక్తులు, చీటీలు, డిపోజిట్ల పేరుతో వ్యాపారం చేస్తున్న వ్యక్తుల వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలని రేగిడి ఎస్‌ఐ బాలకృష్ణ ప్రజలకు సూచించారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల అధిక మొత్తం వడ్డీలు, డిపాజిట్లు, చీటీల పేరుతో మోసాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సమయ పాలన పాటించాలి

రాజాం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో జె.ఆనందరావు ఆదేశించారు. గురవాం సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సకాలంలో పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జీఎస్టీపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు తగవు

నెల్లిమర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ దళితులపై దాడులు జరగడం ఘోరమని జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా నాయకులు టాంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావులు అన్నారు. నెల్లిమర్లలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. బాపట్ల జిల్లా మార్టూరు మండలంలో ఓ దళిత యువకుడిపై అక్కడ పోలీసులు దారుణంగా వ్యవహరించారని, హింసించి గాయపరిచారని అన్నారు. ఈ దారుణానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చదురుగుడి ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఉత్సవాలు నేపథ్యంలో గత కొన్ని రోజులుగా చదురుగుడి, వనంగుడి ఆలయ ప్రాంగణాల వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం చదురుగుడి వద్ద విజయనగరం వాస్తవ్యులు పసుమర్తి సూర్యవరప్రసాద్ బృందంతో అన్నమాచార్య కీర్తనలు అందరినీ అలరించాయి. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీషా పర్యవేక్షణలో ఆయా కార్యక్రమాలు నిర్వహణకు రోజువారీగా షెడ్యూల్ ఖరారు చేశారు.

నదిలో చెత్త



చంపావతి నదిలో పేరుకుపోతున్న చెత్త

గుర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురం వద్ద ఉన్న చంపావతి నదీ పరివాహక ప్రాంతమంతా చెత్తతో దర్శనమిస్తోంది. ఆనందపురం, గరికివలస, పాలవలస, నడుపూరు తదితర గ్రామాలకు చెందిన చెత్తను తీసుకువచ్చి ఇక్కడ నదిలో పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ

- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని దుర్గాదేవి దేవాలయాల్లో, మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)





బొండపల్లిలో ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



రాజాం: లలితాత్రిపుర సుందరిగా విశాలాక్షి అమ్మవారు



జామి: కుమారాంలో దుర్గాదేవి అమ్మవారికి కరెన్సీతో అలంకరణ

వేపాడ: వల్లంపూడిలో అమ్మవారికి వివిధ రకాల వంటకాలతో నైవేద్యం



సంతకవిటి: మోదుగులపేటలో కుంకుమ పూజలు

షెడ్యూల్డ్ ఏరియాలోకి మార్చండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో నాన్‌షెడ్యూల్డ్‌లో ఉన్న దుడ్డుఖల్లు, టి.కె.జమ్ము, పి.కె.మండ, గుమ్మడిగూడ పంచాయతీలోని వివిధ ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలోకి మార్చాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసెంబ్లీలో సంబంధిత మంత్రిని కోరారు. నియోజకవర్గంలో 2014-19 మధ్య నిర్మించిన 2,787 ఎన్‌టీఆర్ గృహాలు, ప్రధాన మంత్రి ఆవాస యోజన ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని విడుదల చేయాలని కోరారు. రేగిడిగెడ్డ, వట్టిగెడ్డ, గుమ్మడిగెడ్డను అనుసంధానం చేయాలని కోరారు.

కౌలురైతులకు యూరియా అందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కౌలురైతుల వద్ద గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వం వారికి యూరియా ఇవ్వడం లేదని శాసన మండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం అమరావతిలో నిర్వహిస్తున్న శాసనమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలురైతులు యూరియా కొరత ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రులు స్పందించి రైతు సేవా కేంద్రాల ద్వారా కౌలురైతులకు యూరియా అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకుంటున్న అమ్మవారి ఆలయం సెట్



చిన్నిపాలెంలో దుర్గాదేవి ఆలయం సెట్

కొత్తవలస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా చిన్నిపాలెం గ్రామంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన సెట్ భక్తులను ఆకర్షిస్తోంది. ఒక పెద్ద ఆలయం నమూనా రూపంలో సెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రవేశద్వారంలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని, పద్మావతి, అలివేలు అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయం లోపల 13 అడుగుల ఎత్తు కలిగిన దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆలయ నమూనా సెట్‌కు, విగ్రహాలకు సుమారు రూ.30 లక్షలు ఖర్చు అయినట్టు నిర్వాహకులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం



విజయనగరంలో దుకాణాల్లో ప్రచారం చేస్తున్న డీసీసీబీ అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి జీఎస్టీని తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శనివారం స్థానిక గంట స్తంభం నుంచి మూడు లాంతర్లు వరకూ ఆయన టీడీపీ నియోజకవర్గ నాయకులతో కలిసి జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం నిర్వహించారు. దుకాణదారులకు అవగాహన కల్పించారు. ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఒక్కొక్క కుటుంబానికి రూ.13వేల నుంచి రూ.15వేల వరకూ ఆదా అవుతుందన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కర్రోతు నర్సింగరావు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, అనురాధబేగం, షైలిపిల్లి పైడిరాజు పాల్గొన్నారు. ● రేగిడి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు ఎంతో ఉపశమనం లభించిందని ఎంపీడీవో శ్యామలాకుమారి, ఇన్‌చార్జి డిప్యుటీ ఎంపీడీవో జగన్నాథంనాయుడు తెలిపారు. శనివారం బాలికా వలస గ్రామంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై వారు ప్రజలకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ జనార్దనరావు పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైలుకు స్వాగతం



అమృత్‌భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బరంపురం టూ ఉదాన్ అమృతభారత్ రైలుకు విజయనగరం రైల్వేస్టేషన్‌లో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావనీ, మాజీ జిల్లా అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, గోపాలకృష్ణ, సీతారాంతో పాటు పలువురు నాయకులు ఈ రైలుకి స్వాగతం పలికారు. ఈసందర్భంగా రాజేష్‌వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రయాణీకులకు మెరుగైన వసతి కల్పించేందుకు ఈ రైలును ప్రారంభించిందని తెలిపారు.

బకాయిలు చెల్లించాలి



టీఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

రాజాం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు ఆరు నెలల వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా ప్రకటించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆర్పీలకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, అర్హత కలిగినవారికి పదోన్నతులు కల్పించాలని, మహిళా వికాస్ యాప్‌ను రద్దు చేయాలని, లాగిన్ లేని ఆర్పీలకు వెంటనే లాగిన్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు తద్వారా తొలగింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని టీఎంసీ రాజేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజాం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



రాజాంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాజాం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా క్షయ, కుష్ఠువ్యాధి నివారణ అధికారిణి కె.రాణి ఆదేశించారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 24న చేపట్టిన కుష్ఠు వ్యాధి సర్వేలో 16 అనుమతి కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు శనివారం ఆమె పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి జిల్లాలో తగ్గుముఖం పట్టిందని, ఈ విషయంలో ఎవరూ భయపడవాల్సిన అవసరం లేదన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు సిద్ధేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● రేగిడి: కుష్ఠు వ్యాధి నియంత్రణ ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని జిల్లా కుష్ఠు, టీబీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డా.రాణి అన్నారు. బూరాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నశిర్లాంలో శనివారం నిర్వహించిన చైతన్య కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. రోగుల ఇంటికి వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఎన్ఎంవో అర్చనదేవి, బూరాడ వైద్యాధికారి రీనా చౌదరి, ఎంపీఈవో రాధాకృష్ణ, పీఎంవో అప్పలస్వామి, డీపీఎంవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి నిరాహార దీక్షలు

- 100వ రోజుకు జిందాల్ నిర్వాసితుల నిరసన



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో సోమవారం నుంచి నిరాహార దీక్షలకు సిద్ధం అవుతున్నట్లు జిందాల్ నిర్వాసితులు తెలిపారు. శనివారం వారు బొడ్డవర గ్రామం వద్ద మాట్లాడారు. ఈ రోజుతో తమ శాంతియుత పోరాటం 100 రోజులకు చేరిందని చెప్పారు. అయినా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి న్యాయం చేయలేదని, అందుకే త్యాగాలకు సిద్ధ పడుతున్నామన్నారు.

గ్రామ సభలు ఏర్పాటుచేయండి

బొడ్డవర, కిల్తంపాలెం, పెదఖండేపల్లి, ముషిడిపల్లి పంచాయతీ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులు అంటూ ప్రకటనలు చేస్తున్న తరుణంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభలు నిర్వహించాలని నిర్వాసితులు కోరారు. ఈ మేరకు బొడ్డవర సచివాలయంలో 600మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడుకు అందించారు.

న్యాయం చేయాలి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిందాల్ రైతులకు న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త దొడ్డ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ భూముల సేకరణ విషయంలో రైతులకు అన్యాయమే జరిగిందన్నారు. బినామీల పేర్లు జాబితాలో చోటు చేసుకున్నాయని, వారి పేర్ల ప్రకారం వారు జిందాల్ నుంచి డబ్బులు లాగేశారన్నారు. నిజమైన రైతులకు న్యాయం చేయాలని, దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

- సగంలో నిలిచిన జాగరం సచివాలయ భవనం

జామి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం గ్రామంలో సగంలో నిలిచిన సచివాలయ భవన నిర్మాణం పేకాట రాయుళ్లకు, మందుబాబులకు అడ్డాగా మారింది. గత కొద్ది నెలలుగా ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేదు. కనీసం పోలీసులు అయినా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. అలాగే ఈ భవన నిర్మాణం సగంలో నిలిచిపోవడంతో పలుచోట్ల బీటలు వారాయి. పైభాగంలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి.



భవనం లోపల పేకముక్కలు



జాగరం సచివాలయ భవనం

కోనేరులో స్నానానికి వెళ్లి యువకుడి మృతి



సతీష్ (ఫైల్)

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డి వలసలో భవానీ మాలధారణలో ఉన్న ఓ యువకుడు చెరువులో స్నానానికి వెళ్లి జారిపడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన మడి అచ్యుతరావు కుమారుడు మడి సాయి సతీష్ (24) భవానీ మాల ధరించాడు. శనివారం అదే గ్రామంలో ఉన్న ఎర్రకోనేరులో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో రక్షించాలని కేకలు వేయగా, దగ్గరలో ఉన్న వారు కోనేరు నుంచి బయటకి తీశారు. కొనఊపిరితో ఉన్న సతీష్‌ను ఆటోలో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న వైద్యుడు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. సతీష్ తండ్రి బొబ్బిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ కొండలరావు కేసు నమోదు చేశారు. శవ పంచనామా చేసి, కేసును దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. సతీష్ డిప్లోమా చదివాడు.

రాయపూర్ స్టీల్‌ప్లాంట్‌లో జిల్లావాసి..



ప్రసన్నకుమార్ (ఫైల్)

గరివిడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో గల గోదావరి స్టీల్ ప్లాంట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో విజయనగరం జిల్లా గరివిడి పట్టణానికి చెందిన కె.ప్రసన్నకుమార్ (45) దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రసన్నకుమార్‌కు భార్య భవానీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గరివిడి పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కారు ఢీకొని ఒకరు..

దత్తిరాజేరు/ సీతానగరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం మరిపివలస వద్ద శనివారం చోటు చేసుకుంది. దత్తిరాజేరు మండలంలోని పాచలవలస గ్రామానికి చెందిన సిరిపురం రాము(49) రోజూలాగే శనివారం రైల్వే కూలి పనులకు పార్వతీపురం వెళ్లాడు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఆటోపై వస్తుండగా సీతానగరం మండలం మరిపివలస వద్ద దేవుడి భోజనాలు అవుతున్నాయి. భోజనాలు చేసేందుకు వెళ్లి, తిరిగి వచ్చి రోడ్డు పక్కనే నిలబడ్డాడు. ఇంతలో పార్వతీపురం వైపు నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న కారు రామును వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో రాము తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కూలీలు బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ రాము చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నారాయణమ్మ, కూతురు రమ్య, తల్లి గడ్డిమ్మ ఉన్నారు.

ఒట్టిగెడ్డలో మహిళ మృతదేహం లభ్యం

వీరఘట్టం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సమీపంలో గల ఒట్టిగెడ్డలో శనివారం మధ్యాహ్నం మహిళ మృతదేహం లభ్యమయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన రౌతు చిన్నమ్మడు (59) మృతదేహంగా గుర్తించారు. ఈనెల 21న బహిర్భూమికి వెళ్తానని ఇంటి నుంచి వెళ్లిందని, ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందామని, ప్రవాహం వల్ల గెడ్డలో పడిపోయి ఉంటుందని కుమారుడు రౌతు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కళాధర్ తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న జి.సత్యనారాయణ అనే వ్యక్తిని పట్టుకుని 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు, ఎస్ఐ పి.శాంతి తెలిపారు. గ్రామంలో శనివారం దాడులు నిర్వహించి, మద్యం సీసాలతో అనుమానాస్పదంగా తిరుగుతున్న సత్యనారాయణను పట్టుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి బబిత

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శాశ్వత ప్రజా న్యాయపీఠంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వత న్యాయపీఠం కింద తగాదాలను రాజీ మార్గం ద్వారా, తుది తీర్పు ద్వారా పరిష్కరించబడతాయన్నారు. బీమా రంగానికి సంబంధించిన సేవలు, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల సేవలు విద్యా సంస్థలకు సంబంధించిన తగాదాలు, నివాసం, వాస్తవ ఆస్తికి సంబంధించిన సేవలు, ఉపాధి హామీకి సంబంధించిన తగాదాలు పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అమటాంరాయవలస పంచాయతీ నారుపేట గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఆక్రమణకు గురైన అప్పలరాజు చెరువును మైన్స్ విజిలెన్స్ అధికారులు శనివారం పరిశీలించారు. అప్పలరాజు చెరువును పూడ్చేసి, ఆక్రమించడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలు దఫాలు కథనాలు వెలువడ్డాయి. దీనిపై తహసీల్దార్ రమణమ్మ ఆ చెరువులో బోర్డులు ఏర్పాటు చేయించారు. ఎంపీడీవోకు, పంచాయతీకి, ఇరిగేషన్ శాఖలకు నివేదికలు పంపించారు. దీనిలో భాగంగా మైన్స్ డీడీ సీహెచ్ సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు.. మైన్స్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.అశోక్‌కుమార్ సూచనలతో విజిలెన్స్ మైన్స్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ కె.పైడితల్లి, ఎం.సతీష్‌లు ఈ చెరువును పరిశీలించారు. నివేదికను పైఅధికారులకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలకృష్ణ, వీఆర్వో చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇకనైనా 'గ్రోత్' ఉంటుందా?

(ఏడో పేజీ తరువాయి)

ఏర్పాటు చేసే వారికి అప్పగిస్తారు. అలా అప్పగించిన తరువాత పరిశ్రమల యజమానులు నిర్మించే భవనాలపై ఆస్తిపన్ను వసూలు చేస్తారు. ఐలాకు కమిషనర్ స్థాయి అధికారి ఉండాలి. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఐలా కార్యకలాపాలు సన్నగిల్లాయి. అధికారులెవరూ అందుబాటులో ఉండడం లేదు. కాగా ఐలాకు రావాల్సిన బకాయి లన్నింటినీ ఆ అకౌంట్‌లో జమచేయడమే తప్ప అందులోనుంచి ఒక్క రూపాయి తీసుకునే వెసులుబాటు స్థానిక ఏపీఐఐసీ అధికారులకు లేకపోవడం గమనార్హం.

ఇంకా 94 పరిశ్రమలే..

గ్రోత్‌సెంటరులో 320 యూనిట్లు ఏర్పాటైనప్పటికీ ప్రస్తుతం 94 పరిశ్రమలే పనిచేస్తున్నాయి. అందులో బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో 22 పరిశ్రమలుండగా, మిగిలినవన్నీ నారాయణప్పవలస, మెట్టవలస తదితర పంచాయతీల పరిధిలో ఉన్నాయి.

భారంగా రిజిస్ట్రేషన్ ఫీజు..

గ్రోత్‌సెంటరులో ప్లాట్లు పొంది తిరిగి వాపసు చేయాలనుకునేవారు రిజిస్ట్రేషన్ రద్దు ఫీజు రూపేణా గతంలో రూ.1100 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడా ఫీజును ప్లాటు విలువలో 4 శాతానికి పెంచడంతో ఈ ప్రక్రియలో స్థలాలు పొందేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఫలితంగా ఆ స్థలాలన్నీ ఖాళీగా ఉండిపోతున్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి స్థలాల కేటాయింపు సాధ్యం కావడం లేదు.

సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ..

వైసీపీ హయాంలో ఆ పార్టీ కీలక నేతకు ఇక్కడ 30 ఎకరాలను ఎకరం రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తూ వేగావతి నదీజలాల వినియోగం కోసం ప్రత్యేక జీవో ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి అడ్డదారి కేటాయింపులపై పెద్దదుమారం రేగడంతో వాటిని రద్దు చేసినట్లు చెబుతున్నారు. ఇదే మార్గంలో సుమారు 350 ఎకరాల పైగా భూములు ఖాళీగా ఉన్నాయి. కొంతమంది ఇతరులకు ఆ స్థలాలను సబ్ లీజులకు ఇచ్చుకుంటున్నారు.

నోటీసులు ఇచ్చి మమ..

స్థలాలు పొందినవారు పరిశ్రమలను ఏర్పాటు చేయకపోతే ఆ కేటాయింపులను రద్దు చేసే అధికారం ఏపీఐఐసీకి ఉంది. అలా స్థలాలు పొందినవారికి నోటీసులు ఇచ్చాక అధికారులు మిన్నకుండిపోతున్నారు. నోటీసులు జారీ చేస్తే అనేకమంది పారిశ్రామిక వేత్తలు వాటికి స్పందించడం లేదు. ఇంకొంతమంది పైరవీలు చేసి తప్పించుకుంటున్నారు. కాగా 30సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న భూములలో కొందరు రైతులు పండించుకుంటున్నారు. గతంలో ఇలా వ్యవసాయం చేసుకుంటున్న వారిపై అధికారులు ప్రతాపం చూపారు.

● గతంలో మోయర్స్ అనే సంస్థ సుమారు 200 ఎకరాల్లో విశాఖ స్టీల్స్‌కు అనుబంధంగా పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఉపక్రమించింది. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత పనులు నిలిచిపోయి ప్రాజెక్టు పూర్తిగా రద్దయిపోయింది.

ప్రభుత్వానికి ఎన్నో వినతులిచ్చాం..

రోడ్లు, విద్యుత్ సౌకర్యాల కల్పనలో నాణ్యత పెంచాలి. విద్యుత్ టారిఫ్‌ను సవరించాలి. గుంతలు, మురుగునీటితో నిండి ఉన్న ప్లాట్లను గ్రీనరీ కోసం కేటాయించాలి. రాత్రివేళల్లో చాలా భయంగా గడపాల్సి వస్తోంది. చినుకుపడినా, గాలివీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ సిబ్బంది సైతం నానా ఇక్కట్లు పడుతున్నారు. ఆసక్తికరమైన పారిశ్రామిక పాలసీని ఏర్పాటు చేయాలి. పరిశ్రమ యూనిట్లు ఏర్పాటు చేసిన తరువాత స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాము. ఆస్తిపన్ను రేటు చాలా ఎక్కువగా ఉంటోంది. ఐలా కార్యకలాపాలను పారదర్శకంగా పునరుద్ధరించాలి.

-బీవీఏరావు,పరిశ్రమల నిర్వాహకుల సంక్షేమసంఘం ప్రతినిధి

కాలుష్యం మాకు.. ఉద్యోగాలు వారికా?

గ్రోత్‌సెంటరులో పరిశ్రమలు వస్తాయని చెప్పగానే మెట్టవలస, ఎం.బూర్జివలస, పెంట, నారాయణప్పవలస, గొర్లెసీతారాంపురం గ్రామాలకు చెందిన భూములను కారుచౌకగా ప్రభుత్వానికి ఇచ్చాం. అప్పట్లో మాకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో ఎకరా రూ.30 వేలు లోపు ధరకు ఇచ్చేసాం. ఇప్పుడేమో మా గ్రామాల కుర్రాళ్లకు ఉద్యోగాలు రావడం లేదు. ఒడిశా, బీహార్, జార్ఖండ్ ప్రాంతాల నుంచి కార్మికులను తెప్పించుకొని పనులు చేయించుకుంటున్నారు. కాలుష్యం, రోగాలు మాకు అంటగట్టారు. స్థానికులకు ఉపాధి కల్పించాలి.

-పువ్వల మాధవరావు, సర్పంచ్, మెట్టవలస

అమృత్‌భారత్ రైలుకు బొబ్బిలిలో ఘన స్వాగతం

(ఏడో పేజీ తరువాయి)

స్వాగతించారు. వీరిరువురితో పాటు రైల్వే అధికారులు రైలుకు లాంఛనంగా పచ్చజెండా ఊపారు. రైలు నడుపుతున్న పైలట్‌లను బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు మాట్లాడుతూ అమృత్‌భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ ఇవ్వడం హర్షనీయమన్నారు. ఒడిశా నుంచి గుజరాత్ వరకు పలు రాష్ట్రాల మీదుగా వెళుతున్న ఈ రైలు బొబ్బిలి ప్రాంత రైల్వే ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రైల్వే అధికారులు మాట్లాడుతూ జీఎస్‌టీ బచత్ ఉత్సవ్‌లో భాగంగా అత్యంత ఆధునిక సదుపాయాలతో అనేక రాష్ట్రాల మధ్య సామాజిక, ఆర్థిక సంబంధాలను మెరుగుపరిచే విధంగా అమృత్‌భారత్ రైలును ప్రవేశపెట్టారన్నారు. తొలుత రైల్వే జోనల్ సలహా మండలి సభ్యుడు నంబియార్ వేణుగోపాలరావు, సీనియర్ బీజేపీ నేత పుల్లెల శ్రీనివాసరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. బాలిక దామిని నృత్యప్రదర్శన, రైల్వే సిబ్బంది దేశభక్తి గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పెంట స్వామినాయుడు, ముగడ అనిల్‌కుమార్, ఈశ్వరరావు, చెలికాని కేశవ, మున్సిపల్ కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కళ్యంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు 'తారు'మారు

(ఏడో పేజీ తరువాయి)

తారు రోడ్డు, 0.37 కిలోమీటర్ల దూరం సిమెంటు రోడ్డు, మధ్యలో ఏడు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. అప్పట్లో కరకవలస పంచాయతీ నుంచి కొండ దిగువ ప్రాంతం వరకు రోడ్డు వేసి వదిలేసారు. మిగిలిన రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు లేవని మధ్యలో ఆపేసారు. తిరిగి 2021 డిసెంబర్ 30న పనులు చేపట్టారు. 2022 డిసెంబర్ 30 నాటికి పనులు పూర్తిచేసేయాలి కానీ నిధులు చాలవని కాంట్రాక్టరు ఆపేసారు. దీనిపై సీపీఎం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో గిరిజనులు వేపాడ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆ మధ్య ముట్టడించారు. వంటా వార్పు చేసుకోని అక్కడే నిద్రించారు. దీంతో పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. నిధులు ఎంతవరకు వస్తే అంతవరకైనా పనులు చేపట్టాలని సూచించడంతో తిరిగి కొనసాగించారు. అప్పటికీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తికానట్లు క్షేత్ర స్థాయి పరిస్థితులను బట్టి తెలుస్తోంది.

● ఈ నాలుగు కిలోమీటర్లతో పాటు మిగిలిన రోడ్డును మూడు బిట్లుగా నిర్మించేందుకు ఉపాధి హామీ నిధుల నుంచి రూ.7కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జనవరి 24న పనులకు భూమి పూజ చేశారు. ప్రస్తుతం 5.02 కిలోమీటర్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు పనులకు సంబంధించిన సామగ్రిని తరలించే వాహనాలు పరిమితికి మించి ఉన్నాయి. దీంతో రోడ్డంతా కుంగిపోతోంది. ఇదిలా వుంటే ఈ రోడ్డుకు ఇరువైపులా పెద్ద కొండలు ఉన్నాయి. పైన పడిన వర్షపు నీరు వరదలా రోడ్డుపైకి వస్తోంది. కల్వర్టుల నుంచి వరద నీరు పోయేందుకు ఎక్కడికక్కడ కాలువలు నిర్మించాలి. ఇవి చేపట్టకుండా మట్టిని తవ్వేసి కాలువలుగా తయారు చేసి వదిలేసారు. పైనుంచి వరద నీటితో కలిసి వచ్చిన మట్టితో ఇవి పూడికపోతున్నాయి. దీంతో కాలువల్లోనుంచి రోడ్డుపైకి వరద నీరు పారుతుండడంతో తారంతా కొట్టుకుపోతోంది. ఈ విధంగా రోడ్డంతా ఛిద్రం అవుతోంది.

కాంట్రాక్టు కాల పరిమితి దాటాక పరిస్థితి ఏంటో?

రోడ్డునిర్మాణ సమయంలో పూర్తైన రోడ్డు నిర్వహణకు ఐదేళ్లపాటు కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి. 2027 డిసెంబరు 29 వరకు కాలపరిమితి ఉండడంతో పాడైన రోడ్డును బాగు చేస్తున్నప్పటికీ వర్షాలు పడుతున్నప్పుడు తిరిగి పాడవుతోంది. కాలపరిమితి ఉన్నంతవరకు కాంట్రాక్టరు పనులు చేస్తారు. ఆ తరువాత పరిస్థితేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డుపై మురుగు.. రాకపోకలకు బేజారు



బీటీ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

● ముంజేరులో వాహన చోదకులకు తప్పని అవస్థలు

భోగాపురం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజేరులో బీటీ రహదారి మురుగు కాలువగా మారింది. సిద్ధార్థకాలనీ వాసులతో కాలువ వివాదం నేపథ్యంలో మురుగు నీరు నిల్వ ఉంటుండడంతో స్థానికులు, వాహన చోదకులు మురుగుతో అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి గ్రామంలో మురుగు బయటకు పోవడానికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో గ్రామంలోని బీటీ రహదారిపైనే ప్రవహిస్తోంది.సుమారు అరకిలోమీటరు మేర వరకు ఆర్‌అండ్‌బీ రహదారిపై మురుగునీరు ప్రవాహం వల్ల రాకపోకలకు అవస్థలుతప్పడంలేదు. ఈరహదారి వెంబడే నిరంతరం ప్రజాప్రతినిధులుతో పాటు అధికారులు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు.ఇప్పటికైనా రోడ్డుపై చేరే మురుగునీటి సమస్యపై శాశ్వత పరిష్కారం చూపంచాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



బొబ్బిలి: దాడితల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



లక్ష్మీదేవి అలంకారంలో గొల్లపల్లి దాడితల్లి



బొబ్బిలిరూరల్: లలితా త్రిపురా సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

భక్తి శ్రద్ధతో కుంకుమ పూజలు

బొబ్బిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో పలు ఆలయాలు, మండపాల్లోశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత వివిద రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధతో కుంకమ పూజలు నిర్వహించారు.

బొబ్బిలి గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి ఆలయంలో అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు.ఈ సందర్భంగా మహిళలు పాల్గొని కుంకుమపూజలు నిర్వహించారు.వేణుగోపాలస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. బ్యాంకర్స్ కాలనీ, బలిజిపేట రోడ్డు, రావువారివీధి, పాతబొబ్బిలి, గొల్లపల్లి, బంగారమ్మ ఆలయం, తారకరామాకాలనీ శ్రీలలితాంబఆలయాల్లో శనివారం పూజలునిర్వహించారు. అప్పయ్యపేట రోడ్డులో నూకాలమ్మను లలితాదేవిగా అలంకరించి పూజించారు.

●బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి, కృష్ణాపురం గ్రామాల్లో శనివారం దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు.

● రామభద్రపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం సాయినగర్‌లో గల దుర్గాదేవి ఆలయంలో పూజారి బాదంపూడి విశ్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు కూడా చేపట్టారు.

వీణల కళాకారులను ఆదుకోవాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి, వాడాడలో గల వీణల తయారీ కళాకారులను ఆదుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. అమరావతిలో రాష్ట్ర చేనేత జౌళిశాఖమంత్రి సవితకు బేబీనాయన వినతిపత్రం అందజేశారు. వీణల తయారీ కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

సస్యశ్యామలం చేయాలి

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు సహకరించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన కోరారు. ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బేబీనాయన కూరగాయలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ పనులకు సంబంధించిన వివరాలను మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. తొలుత ఎమ్మెల్యే బేబీనాయన విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయాన్ని సదర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చిరంజీవికి క్షమాపణ చెప్పాలి

బొబ్బిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో కొణిదెల చిరంజీవిని ఉద్దేశించి అసెంబ్లీ సాక్షిగా నందమూరి బాలకృష్ణ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే చిరంజీవికి క్షమాపణలు చెప్పాలని అఖిలభారత చిరంజీవి యువత ప్రతినిధులు డిమాండ్‌చేశారు. శనివారం బొబ్బిలిలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి, బొబ్బిలిటౌన్ వైడ్ మెగాఫ్యామిలీ అధ్యక్షుడు లంక రమేష్ మాట్లాడారు. వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని చిరంజీవికి బాలకృష్ణ బేషరతు క్షమాపణలను బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చిరంజీవియువత ప్రతినిధులు పోలారావు, త్రినాధస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

బాడంగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈనెల 22 నుంచి ఒకేషనల్ విద్యలో మెలకువలు తెలుసుకునేందుకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వచ్చేనెల ఒకటో తేదీవరకూ సూపర్‌మార్కెట్లు, షాపు, కార్యాలయాల్లో విద్యార్థులు వివిధ రంగాల్లో మెలకువలు నేర్చుకోనున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ, ఒకేషనల్ శిక్షకులు వెంకటరమణ, దినేష్, హసీనా పాల్గొన్నారు.

అక్రమాలు 'వెలుగు'చూసేనా?

(ఏడో పేజీ తరువాయి)

ఎన్నో ఏళ్లనుంచి అక్రమాలకు నిలయంగా ఉందన్న అపవాదు ఉంది. పాలకులు మారుతున్నప్పుడు అధికారులకు బదిలీ కావడం, అలాగే వీవోఏలు స్వచ్ఛందంగా తప్పుకోవడం జరుగుతోంది. ఇప్పుడు కూడా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ వ్యవహారాలన్నీ ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. మండలంలో 1531 డ్వాక్రా సంఘాలు ఉండగా 15,300 మంది వరకు సభ్యులున్నారు. డ్వాక్రాసంఘాల్లో మహిళలకు రుణాలు మంజూరు చేయడంలోగాని, వాటి వసూళ్లలో గాని గ్రామాల్లో ఉండే వీవోఏలు కీలకం. ఇదే అదనుగా కొందరు చేతివాటం చూపుతున్నారు. 2024-25 ఏడాదికి సంబంధించి ఈ మండలానికి రూ.6కోట్ల50 లక్షల వరకు స్త్రీనిధి రుణాలు ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.12కోట్లు ఇచ్చారు. కాగా రుణాలు ఇచ్చేటప్పుడు ఒక్కో సంఘం రూ.3వేలు నుంచి రూ.5వేలు ఇచ్చేయాల్సిందేనట. వీవోఏలే ఆ డబ్బులను వసూలు చేస్తారు.

● 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎఫ్) కింద రుణాలు మంజూరు చేశారు. వాటిని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద వసూలు చేయడానికి ప్రయత్నించింది. 2022లో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. దీంట్లో వీవోఏలే కీలక పాత్ర పోషించారు. గజపతినగరం,పురిటిపెంట, మరుపల్లి, గంగచోళ్లపెంట వంటి పెద్ద గ్రామ పంచాయతీల్లో సీఐఎఫ్ రుణాలు రూ.లక్షల్లో వసూళ్లు చేసినా వేలల్లో జమ చేసినట్లు విమర్శలు వచ్చాయి.

● వైసీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాల్లో సభల నిర్వహణకు మండల సమాఖ్య నుంచి లక్షల రూపాయలు ఖర్చు చేశారు. వాటికి రికార్డులు పక్కాగా లేవని తెలిసింది.

● వైసీపీహయాంలో నియోజకవర్గస్థాయిలో గజపతినగరంలో మహిళామార్ట్ ఏర్పాటు చేస్తామని అందుకు డ్వాక్రా సంఘాల సభ్యులు నుంచి రూ.310 చొప్పున సుమారు రూ.50 లక్షలకు పైగా వసూలు చేశారు. కానీ మార్టూ లేదు.డబ్బులూ తిరిగి ఇవ్వలేదు.

చర్యలు తీసుకుంటున్నాం

వెలుగుపథకంలో అవినీతి ఆరోపణలు ఉన్న వీవోఏలపై చర్యలు తీసుకుంటున్నాం. కొందరి నుంచి రికవరీ కూడా చేశాం. ప్రతి ఒక్కరి వద్ద రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించాం. విధుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.

- ఏపీఎం, నారాయణరావు, గజపతినగరం

పత్ర ద్రావణం తయారీపై అవగాహన



పత్రద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెంటువలసలో రైతులతో 200 లీటర్ల పలుపత్ర ద్రావణాన్ని వ్యవసాయ సిబ్బంది శనివారం తయారీ చేయించారు. ఈ సందర్భంగా వరిలో ఎకరానికి పది లీటర్లు పలుపత్ర ద్రావణం స్ప్రే చేయాలని, మొక్క పెరుగుదలకు, పురుగుకు, పచ్చ, తెల్లదోమకు, పచ్చ పురుగు, మాగుడు తెగలకు బాగా పనిచేస్తుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీ తులసి, ఆర్.రమణ, నల్ల సత్యనారాయణ, ఎం.భారతి, ఐసీఆర్‌పీ హైమా తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ప్రారంభదశలో గుర్తించాలి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్ ప్రారంభ దశలో గుర్తించడం వల్ల నివారించవచ్చని బొబ్బిలి సీడీపీవో జె.విజయలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని పారాదిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వస్థనారీ- సశక్త్ పరివార్ పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ్, సర్పంచ్ నానేశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యవాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, సెక్టర్ పర్యవేక్షకురాలు ఎం.సుబ్బలక్ష్మి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

రామభద్రపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్ కుమార్ తెలిపారు. శనివారం రామభద్రపురంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు పాత్ర చాలా కీలకమని, వారు బాగుంటేనే కుటుంబం అంతా బాగుంటుందన్నారు.అలాగే స్వస్తనారీ శక్తిపరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు రక్తం దానం చేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా తోటపాలెం బాలాజీ నగర్‌లో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసీ మాలలు, పలు పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం రంగాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు.

నిబంధనల ప్రకారం పనిచేయాలి

భోగాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఎం.రమణమ్మ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు సమయానుకూలంగా కార్డుదారులకు బియ్యం, తదితర వస్తువులు అందజేయాలని కోరారు. ఎక్కడైనా కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి బీవీ మురళి, డీలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనపై దృష్టి సారించండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగ సాధనపై దృష్టి సారించాలని నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ సూచించారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో రామాలయం వద్ద గ్రామస్థులు, యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న కొన్ని ముఖ్యమైన సమస్యలపై చర్చించారు. అలాగే యువత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై దృష్టిపెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

రాజాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం కమిషనర్ జె.రామప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైందని, వర్షాకాలంలో ఇబ్బంది కరంగా ఉందని, ఎవరైనా మరణిస్తే శ్మశాన వాటికకు తీసుకు వెళ్లడానికి ఇబ్బందులు తప్పడంలేదని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు, అధికారులు, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినా ఫలితం కనిపించలేదని జనసేన నాయకులు గార యర్రంనాయుడు, లెంక అప్పలనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లెంక వెంకటరమణ, డబ్బాడ కృష్ణ ప్రవీన్ మీసాల ప్రవీణ్‌కుమార్ తదితరులు తెలిపారు.అలాగే ఇనమల వీధిలో నుంచి గార వీధి వచ్చే మార్గంలో అసిరితల్లి మలుపు దగ్గర రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కమిషనర్‌ను కోరారు. చాకలవీధికి వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభానికి లైట్ అమర్చడం లేదని పేర్కొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండ ఎక్కని వైద్యులు అంటూ రెండు రోజుల కిందట ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో మండలంలోని బొడ్డవర లోకెటెడ్ పీహెచ్‌సీ వైద్యురాలు మానస స్పందించారు. శనివారం ఉదయం దారపర్తి పంచాయతీల్లో ఉన్న పలు గ్రామాలకు చేరుకుని, అక్కడ స్వస్థ్ నారీ సశక్త్ పోషణ అభియాన్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి, మహిళలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పల్లపుదుంగాడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది